# గిరిజనుల అభివృద్ధి సీఎం కేసీఆర్‌తోనే సాధ్యం




బానోత్ హరిప్రియానాయక్‌కు బొట్టుపెట్టి ఆశీర్వదిస్తున్న మహిళలు, మాట్లాడుతున్న హరిప్రియానాయక్

- గిరిజనులకు పోడు పట్టాలు ఇచ్చిన ఘనత కేసీఆర్‌దే
- తండాలను, గూడేలను పంచాయతీలుగా మార్చారు
- ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు
- ఇల్లెందు నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ హరిప్రియానాయక్

టేకులపల్లి, నవంబర్ 5: గిరిజనుల పోడు భూములకు పట్టాలు, రిజర్వేషన్ పెంపు, మా తండాలో మా రాజ్యం, మాగూడెంలో మా రాజ్యం వంటి ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమాలు చేసిన సీఎం కేసీఆర్‌తోనే గిరిజనుల అభివృద్ధి సాధ్యమని ఇల్లెందు బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే హరిప్రియానాయక్ అన్నారు. ఆదివారం మండలంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా హరిప్రియానాయక్ పలు గ్రామ పంచాయతీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. తొలుత రోళ్లపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని రుక్మతండా, బీల్యాతండా, రోళ్లపాడులో గ్రామాల్లో నిర్వహించిన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తొలిసారి గెలిచాక గిరిజన ప్రాంతాలకు ఎక్కువ మొత్తం నిధులు విడుదల చేసి అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. రెండో సారి గెలిచాక గిరిజన తండాలను, గూడేలను పంచాయతీలుగా ఏర్పాటు చేసి మా తండాలను మనమే పాలించాలని, మా గూడేలను మనమే పాలించాలని చెప్పారన్నారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న పోడు భూముల సమస్యను పరిష్కరిస్తానని చెప్పి మాట ఇచ్చి ప్రకారమే పోడు పట్టాలు ఇచ్చి రైతు బంధు, రైతు బీమాలు అమలు చేస్తానని అన్నారని చెప్పారు. గిరిజనుల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకోని గిరిజన రిజర్వేషన్ పెంచారని, గిరిజనుల అభివృద్ధికి సీఎం కేసీఆర్ చిత్తశుద్ధితో పని చేస్తున్నారో ఆలోచించాలన్నారు. అదేవిధంగా మ్యానిఫెస్టోలో పేర్కొన్న పథకాల పెంపును చేస్తు రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న కేసీఆర్‌ను ఆశీర్వదించి మూడోసారి ముఖ్యమంత్రిగా చేయాలని, ఇల్లెందు నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థిగా నన్ను కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అదేవిధంగా తొమ్మిదోమైలుతండా, బేతంపూడి, గోలీయ తండా, తావుర్యతండా, తడికలపూడి, కొత్తతండా, రాంపురం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ప్రతి గ్రామంలో ప్రజలు హరిప్రియకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బొమ్మెర్ల వరప్రసాద్‌గౌడ్, బోడ బాలునాయక్, బానోత్ రామానాయక్, బానోత్ కిషన్‌నాయక్, చీమల సత్యనారాయణ, ధారవత్ బాలాజీ, జాలది అప్పారావు, లక్కినేని శ్యామ్‌బాబు, కంభంపాటి చంద్రశేఖర్ రావు, దళపతి శ్రీనివాసరాజు, ధారవత్ లలిత, శంకర్, జర్పుల బిచ్చ, బానోత్ రవికుమార్, భూక్యా బాలకృష్ణ, జాటోత్ నరేశ్, భూక్యా రమేశ్, ధారవత్ శంకర్, జర్పుల రాజు తదితరులు పాల్గొన్నారు.





కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న హరిప్రియానాయక్, నాయకులు, కార్యకర్తలతో కలిసి పర్యటిస్తున్న హరిప్రియ, దివ్యాంగురాలితో మాట్లాడుతున్న హరిప్రియ

## అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ



మాట్లాడుతున్న రఘురామరెడ్డి

ఇల్లెందు రూరల్, నవంబర్ 5: అప్రమత్తతతోనే ప్రమాదాలను నివారించవచ్చని రక్షణ వారోత్సవాల కన్వీనర్, ఈ అండ్ ఎం జీఎం రఘురామరెడ్డి అన్నారు. ఆదివారం 54వ రక్షణ వారోత్సవాల సందర్భంగా సీహెచ్‌పీ ఏరియాలో ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్‌తో కలిసి రక్షణ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు భద్రత విషయం లో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటి నుంచి విధులకు బయలుదేరి తిరిగి ఇంటికి చేరుకునే వరకు రక్షణ పద్ధతులు పాటించాలన్నారు. ఎటువంటి ప్రమాదాలకు అవకాశం లేకుండా బొగ్గు రవాణా చేపట్టాలన్నారు. కేటాయించిన విధులను బాధ్యతగా నిర్వర్తించాలన్నారు. అనంతరం ఉద్యోగులతో కలిసి రక్షణ ప్రతిజ్ఞ చేశారు. భద్రత కలిగిన ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు నరేంద్రకుమార్, పీ శ్రీనివాస్, ఆంజనేయ ప్రసాద్, నరేందర్, వెంకటేశ్వర్లు, సేఫ్టీ అధికారి పీ శ్రీనివాస్, ఇంజినీర్ నర్సింహారాజు, అధికారులు క్రిస్టోఫర్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## పద్మశాలీల వనసమారాధన



వనభోజనాల్లో కుటుంబ సభ్యులతో పాల్గొన్న పద్మశాలీలు

ఇల్లెందు రూరల్, నవంబర్ 5: మండలంలోని రొంపేడు చెక్‌పోస్టు మామిడి తోటలో ఆదివారం పద్మశాలి సంఘం ఆధ్వర్యం లో వనసమారాధన నిర్వహించా రు. ఈ సందర్భంగా సంఘం పట్టణ అధ్యక్షుడు గోచికొండ సత్యనారాయణ మాట్లాడుతూ సంవత్సరంలో ఒక రోజు అందరం ఇక్కడ కలుసుకుని ఆటాపాటలతో కాలక్షేపం చేయడం ఆనందంగా ఉందన్నారు. వనభోజనాలతో బంధాలు, అనుబంధాలు గట్టిపడుతాయన్నారు. ప్రకృతి ఒడిలో ప్రకృతిని ఆస్వాదిస్తూ ఆనందంగా భోజనం చేయడం ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరమన్నారు. అనంతరం మహిళా కమిటీ అధ్యక్షురాలిగా సామల మాధవి, ప్రధాన కార్యదర్శిగా గడిదాసి వరలక్ష్మి, ఉపాధ్యక్షులుగా గోచికొండ శ్రీదేవి, సిరిమల్ల పల్లవిని ఎన్నుకున్నారు.చిన్నారులు చేసిన ఆటాపాటలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోతుకూరి ధర్మారావు, సంఘం సభ్యుడు శంకరలింగం, సిరిమల్ల రమేశ్, పెందుర్తి నర్సయ్య, కందికట్ల సాంబయ్య, దోమల మహేశ్, సిరిమల్ల రాజు, నర్సింహారావు, కిశోర్, నాగరాజు, చిలువేరు రమేశ్, రాధాకృష్ణ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పచ్చని పంటంత అభిమానం !



పంటల పెట్టుబడికి రైతుబంధు.. ప్రమాదవశాత్తు రైతు మృతిచెందితే ఆ కుటుంబానికి రూ.5 లక్షల బీమా పరిహారం.. రైతులు అప్పుల్లో కూరుకుపోకుండా రుణమాఫీ.. పంటలకు 24 గంటల పాటు ఉచితంగా నాణ్యమైన విద్యుత్.. ఇలా రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం బోడ దేశ్యానాయక్‌ను ఫిదా అయ్యేలా చేసింది. ఆ అభిమానంతో సదరు రైతు సీఎం కేసీఆర్‌ను దేవుడిలా కొలుస్తున్నాడు. కేసీఆర్‌పై తన అభిమానాన్ని చాటుతూ ఆదివారం తాను సాగు చేస్తున్న మిర్చి తోటలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే హరిప్రియ నిలువెత్తు ఫ్లెక్సీ ఏర్పాటు చేశాడు. వెంకట్యాతండాలో 'నమస్తే' ఈ చిత్రాన్ని కెమెరాలో బంధించింది.

- టేకులపల్లి, నవంబర్ 5

# పంచాయతీల్లో పరుగులా ప్రయాణం

- మారుమూల గ్రామాల్లోనూ బీటీ, సీసీ రోడ్లు
- రాకపోకల కోసం మెరుగైన రవాణా సౌకర్యం
- అన్ని వీధుల్లోనూ వెలుగులీనుతున్న విద్యుత్ దీపాలు
- బీఆర్ఎస్ ప్రభుత్వంలోనూ గ్రామాల అభివృద్ధి

ఇల్లెందు రూరల్, నవంబర్ 5: బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలోనే మారుమూల గ్రామాలు కూడా అద్భుతంగా అభివృద్ధి చెందాయి. ముఖ్యంగా పంచాయతీల్లో ప్రయాణ సౌకర్యాలు పరుగులు పెడుతున్నాయి. వలసవాదుల పాలనలో దుర్భరంగా ఉన్న పల్లెలు నేటి స్వరాష్ట్రంలో అద్భుతంగా రూపుదిద్దుకున్నాయి. కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక పల్లెల ముఖచిత్రాలు పూర్తిగా మారిపోయాయి. చిన్న పంచాయతీలను ఏర్పాటు చేసి అధిక నిధులు మంజూరు చేయడంతో గ్రామాలన్నీ గణనీయంగా అభివృద్ధి చెందాయి. గతంలో మారుమూల ప్రాంతాల ప్రజలు మండల కేంద్రాలకు చేరుకోవాలంటే సరైన రహదారుల సౌకర్యం ఉండేదికాదు. ఇప్పుడు బీటీ రోడ్లు, సీసీ రోడ్లు నిర్మించడంతో రహదారులు మెరుస్తున్నాయి. ముఖ్యంగా రవాణా సౌకర్యం మెరుగుపడింది. అలాగే, అదే రహదారులపై విద్యుత్ దీపాలు కూడా ఏర్పాటు చేయడంతో పగలూ రాత్రీ తేడా లేకుండా ప్రజలు నిశ్చింతగా రాకపోకలు సాగిస్తున్నారు.

**రోడ్ల నిర్మాణానికి అధిక నిధులు..**

ఇల్లెందు మండలంలో రోడ్ల నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వం అధిక నిధులు కేటాయించింది. ఎమ్మెల్యే హరిప్రియానాయక్ ప్రాధాన్య క్రమంలో ఆయా గ్రామాల్లో బీటీ, సీసీ రోడ్లను నిర్మించారు. మరికొన్నింటిని నిర్మిస్తున్నారు. ఉదాహరణకు గమనిస్తే.. మాణిక్యారం – దేశియాతండా మధ్య రూ.57 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి, మాణిక్యారంలో రూ.20 లక్షలతో మూడు సీసీ రోడ్ల నిర్మాణానికి ఇటీవలే ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. రోజుల వ్యవధిలోనే వాటిని పూర్తి చేసి ప్రారంభించారు. అయితే, పొరుగు రాష్ట్రాల్లో స్థిరపడిన మిత్రులు, బంధువులు పండుగలు, వేడుకల సమయంలో తమ స్వగ్రామాలకు వచ్చి ఇక్కడి రోడ్లను, ఇతర సౌకర్యాలను చూసి అబ్బురపడుతున్నారు. సీఎం కేసీఆర్ పాలనను ప్రశంసిస్తున్నారు. ఇక్కడి యువతీ యువకులతో వివాహ సంబంధాలు కలుపుకునేందుకు ఎంతో ఆసక్తి చూపుతున్నారు.



పంచాయతీల్లో ఏర్పాటైన రోడ్లు

### ఎంత రాత్రయినా సాఫీగా ఇంటికి చేరుకుంటున్నాం



నా జీవితంలో ఇంతటి అభివృద్ధిని చూస్తాననుకోలేదు. నా చిన్నతనం నుంచి ఇక్కడ మట్టి రోడ్లే ఉండేవి. ఎన్నో అవస్థలు పడుతూ వాటిపై ప్రయాణించే వాళ్లం. కానీ తెలంగాణ సిద్ధించాక, కేసీఆర్ సీఎం అయ్యాక గ్రామాలు కూడా ఎంతో అభివృద్ధి చెందాయి. ముఖ్యంగా బీటీ, సీసీ రోడ్లు వచ్చాయి. వీధుల్లో విద్యుత్ దీపాలు వెలుగుతున్నాయి. ఏదైనా అత్యవసర పనుల మీద ఊరు వెళితే ఎంత రాత్రయినా సాఫీగా ఇంటికి చేరుకోగలుగుతున్నాం.

- రామటెంకి నర్సయ్య, మాణిక్యారం, ఇల్లెందు మండలం

### పెళ్లి సంబంధాలు పుష్కలంగా వస్తున్నాయి..



గతంలో మారుమూల గ్రామాలకు సరైన రహదారులు ఉండేవి కావు. దీంతో మా గ్రామాల్లోని యువతీ యువకులతో ఎవరైనా వివాహ సంబంధాలు కలుపుకోవాలంటే జంకే వారు. రోడ్డు కూడా సరిగా లేని ఊళ్లకు పిల్లలను ఎలా పంపాలని అనుకునే వాళ్లు. కానీ ఇప్పుడు రోడ్లు వేశాక, రవాణా సౌకర్యం మెరుగయ్యి పరిస్థితులు మారిపోయాయి. దీంతో ఇతర ప్రాంతాల వాళ్లు కూడా తమ ఊరి పిల్లలతో వివాహ సంబంధాలు కలుపుకునేందుకు వస్తున్నారు.

- కటికర్ల నాగేశ్వరరావు, మాణిక్యారం, ఇల్లెందు మండలం